క్లుప్తంగా

చిట్యాల సీఐగా వేణుచందర్



చిట్యాల: చిట్యాల సీఐగా దాసారపు వేణుచందర్ ఖమ్మం జిల్లా నుంచి బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మొక్కలను సంరక్షించాలి



మహాముత్తారం: నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. అనంతరం కలుపు మొక్కలను తొలగించి మొక్కలను సంరక్షించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి వేణు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



చిట్యాల: మండల కేంద్రంలోని చింతలపల్లి గ్రామస్తులు శుక్రవారం ఘనంగా పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించి బోనాలను సమర్పించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ముందస్తుగా మహిళలు, పిల్లలు కలిసి డప్పు చప్పుళ్లతో పోచమ్మ గుడి వద్దకు బోనాలను తీసుకెళ్లారు. పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం'

కాటారం: టీఎస్‌పీఎస్సీ కమిషన్ ప్రభుత్వంతో కుమ్మక్కై నిరుద్యోగ జీవితాలతో చెలగాటమాడుతుందని ఎస్ఎఫ్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివసాయికృష్ణారెడ్డి ఆరోపించారు. కాటారం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో అధికార పార్టీ పెద్దల హస్తం ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ సిబ్బంది డబ్బులకు కక్కుర్తిపడి పేపర్ లీక్ చేయడం సిగ్గుచేటన్నారు. పేపర్ లీక్, పరీక్ష రద్దు వరుస పరిణామాలతో నిరుద్యోగులంతా తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని అన్నారు. ఉద్యోగ ప్రకటన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులతో ఆటలాడుతుందని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రం లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తు చేసుకోవాలి

చిట్యాల: ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.100 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈ నెల 20 వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఏటూరునాగారం: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని శివాపురం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం చేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంక దేవేందర్, బీఆర్‌ఎస్ నాయకులు కొత్తపల్లి వెంకన్న, మిటకంటి సమ్మయ్య, దాసరి రాజు, బండి మల్లేష్, సామ రవి, కనుకుల సదానందం, మోకాళ్ల రంజిత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో గొర్రె మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లోనిపల్లి గ్రామంలోని వావిలాల చిన్నతిరుపతికి చెందిన గొర్రెలు రోజువారిగా మేతకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో కొంపెల్లి గ్రామం ఎస్సీకాలనీలో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరుకు 11 గొర్రెలు తగిలి విద్యుత్‌షాక్ గురయ్యాయి. దీంతో పది గొర్రెలు అస్వస్థకు గురికాగా, ఒక గొర్రె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గొర్రె విలువ సుమారుగా రూ.12వేలు ఉంటుందన్నారు. గతంలో ఇక్కడే రెండు గొర్రెలు, రెండు గేదెలు మృతిచెందాయని అయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



టేకుమట్ల: మాట్లాడుతున్న వైద్యాధికారి ఆశాజ్యోతి



పలిమెల: మాట్లాడుతున్న ఎంపీపీ బుచ్చక్క



మహదేవపూర్: మాట్లాడుతున్న సుస్మిత



కాటారం: మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

టేకుమట్ల: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, అధ్యక్షతన క్షయ వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. టీబీ నివారణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచిత పరీక్షలతో పాటు, మందులను సైతం అందిస్తారని, టీబీ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్, ఏఎన్ఎం సంగీత, హెత్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంగీతరాణి, టీబీ సూపర్‌వైజర్ రవీంద్రనాయక్, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మహదేవపూర్: టీబీని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుస్మిత అన్నారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులకు టీబీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. మనిషి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఒకరికి ఈ వ్యాధి సంక్రమిస్తుందని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట జ్వరము, బరువు తగ్గడం, దగ్గినప్పుడు తేమడ రావడం జరిగితే టీబీ వ్యాధి బారిన పడినట్లు నిర్ధారించుకోవచ్చని అన్నారు. ఆరు నెలల మందులు వాడితే తగ్గుతుందన్నారు. ఈనెల 24న మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో టీబీ అవేర్నెస్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, సర్పంచ్ శ్రీపతి బాపు, నాగుల లక్ష్మారెడ్డి ఎంపీటీసీ రేవెల్లి మమత, జయశ్రీ, ఎంపీఓ ప్రసాద్, ఏపీఎం రవీందర్, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ స్వామి, హెచ్‌వీ సమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజరమణయ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కాటారం: టీబీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ వ్యాధిని ప్రారంభంలోని గుర్తించి నివారణకు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ.. ఎడ తెరిపిలేని దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి తగ్గడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం క్షయ వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో నాలుగు మండలాల ప్రజలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న వైద్యురాలు నాగరాణి

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై డాక్టర్ నాగరాణి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి హాజరై మాట్లాడారు. మండలాన్ని క్షయ వ్యాధి రహిత మండలంగా మార్చుదామని దానికి ప్రజాప్రతినిధులు, అన్ని అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు. అనంతరం డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. రెండు వారాలు మించిన దగ్గు, జ్వరము, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్న వారికి తెమడ పరీక్ష చేయించాలని దానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు. టీబీ ఉన్నవారికి ఉచిత మందుల పంపిణీ, నెలకు రూ.500 ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్ రావు, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం రవివర్మ, సీహెచ్‌ఓ వెంకటస్వామి, సూపర్‌వైజర్ దయామణి, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని గ్రామాల ఏఎన్ఎంలు ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పలిమెల: దేశాన్ని టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీపీ కురసం బుచ్చక్క అన్నారు. శుక్రవారం మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో టీబీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ జగదీశ్, ఎంపీటీసీ దందేర కల్యాణి, సర్పంచ్‌లు, మండల అధికారులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీపీఎం జన చైతన్యయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

భూపాలపల్లి అర్బన్: బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో నేడు(శనివారం) జిల్లా కేంద్రంలో జన చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.మల్లారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాదశక్తులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. కేంద్ర విధానాలను ఎండగట్టడానికి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. వరంగల్‌లో ప్రారంభమైన ఈ యాత్ర ఈ నెల 29వ తేదీన ఇబ్రహీంపట్నంలో ముగించనున్నట్లు తెలిపారు. ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ములుగు జిల్లా కేంద్రం మీదగా శనివారం భూపాలపల్లి జిల్లాకు చేరుకుని హన్మాన్‌దేవాలయం నుంచి మున్సిపాలిటీ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని కార్మికులు, కర్షకులు, రైతు కూలీలు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు నాయకులు బందు సాయిలు, కంపేటి రాజయ్య, వెలిశెట్టి రాజయ్య, శ్రీకాంత్, వెంకయ్య, కిరణ్‌లు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న సత్యనారాయణరావు

టేకుమట్ల(రేగొండ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయరావు అన్నారు. శుక్రవారం రేగొండ మండలంలోని కొత్తపేట(బి), రావులపల్లి, రామగుండాలపల్లి, జగ్గయ్యపేట, తిరుమలగిరి గ్రామాల్లో మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో హాథ్ సేహాథ్ జోడో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని నమ్మబలికి అధికారం చేజిక్కికుని ఇప్పటి వరకు డబుల్ బెడ్రూంలను అందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లే దర్శనమిస్తున్నాయని అన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ బడా కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనపై ప్రజలు విసుగు చెందారని, రానున్న రోజుల్లో నిరంత పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లాపల్లితో పాటు మండల కేంద్రంలో ముదిరాజ్ కులస్తులు నూతనంగా నిర్మించుకుంటున్న పెద్దతల్లి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ కిరణ్

మహదేవపూర్: అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సీఐ కిరణ్ అన్నారు. మండలంలోని రాపల్లికోట శుక్రవారం సాయంత్రం కార్డన్ సెర్చ్ నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా వ్యక్తులు కొత్తగా కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే గ్రామంలో మత్తు పదార్థాలైన గంజాయి, గుట్కా, సారా వంటివి విక్రయించవద్దని, ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమించి విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై రాజ్‌కుమార్, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడి చేయిస్తారా?



నిరసన తెలుపుతున్న రాంబాబు

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి పంచాయతీలో అవినీతి జరుగుతుందని ప్రశ్నిస్తే తనపై దాడి చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆ గ్రామ ఉప సర్పంచ్ పాలేపు రాంబాబు ఆరోపించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో రైతు కల్లాలపై, ఉపాధిహామీ, ఇంకుడు గుంతలపై అవినీతిపై విచారణ జరిపించాలని ఐదు రోజుల క్రితం డీఆర్‌డీఏ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన గ్రామ సర్పంచ్ భర్త పువ్వాటి వెంకటేశ్వర్లు తనపై కక్ష కట్టి గ్రామ సభ ఏర్పాటు చేసి ఆయన బంధువులతో కలిసి దాడి చేసేందుకు కుట్ర పన్నారనే సమాచారం తనకు తెలిసిందన్నారు. గతంలో ఇసుక అక్రమ నిల్వలు చేస్తే పట్టించినందుకు తనపై అప్పటి నుంచి రాజకీయ కక్ష పెంచుకుని దాడి చేసేందుకు అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. అలాగే తనతో పాటు మరో ఇద్దరు బిక్కు ప్రభాకర్, రామకృష్ణలు గ్రామంలో జరుగుతున్న అవినీతిపై పలు మార్లు అడిగినందుకు వారిని బూతులు తిడుతూ వారిపై కూడా దాడి చేసేందుకు కుట్ర చేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. తమకు అధికారులు రక్షణ కల్పించాలి మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అధికారులు పూర్తి రక్షణ ఇస్తేనే గ్రామంలోకి వెళ్తామని వారు పేర్కొన్నారు.

దుకాణాల నిర్వహణకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దుకాణాల నిర్వహణకు శుక్రవారం సీల్డటెండర్ కం, బహిరంగ వేలాన్ని నిర్వహించినట్లు ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, చైర్‌పర్సన్ మాదాడి అనితాకరుణాకర్ రెడ్డి తెలిపారు. వేలం పాటలో ఎప్రిల్ 2023 నుంచి ఫిబ్రవరి 2024 వరకు 11 నెలల పాటు జాతరలో కొబ్బరికాయలు అమ్ముకునేందుకు రూ.9లక్షల 10వేలు, పూల దండలు, విడిపూలు అమ్ముకునేందుకు రూ.78వేలకు హెచ్చుపాటలో సొంతం చేసుకున్నట్లు తెలిపారు.

'రాజకీయ కక్షతోనే రోడ్డు సర్వేలో మార్పు'



మాట్లాడుతున్న రైతులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జాతీయ రహదారి 353(సీ) రోడ్డు మార్గాన్ని రాజకీయ కక్షతోనే రోడ్డు సర్వేలో మార్పులు చేశారని దళిత రైతులు ఆరోపించారు. శుక్రవారం రైతులు మాట్లాడుతూ.. గతంలో జాతీయ రహదారి గురించి మూడు సర్వేలను ఎన్‌హెచ్ ఇంజనీర్లు, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. పూర్వపు రహదారి వెంట, ముక్తివనం పార్కు గుండా, సబ్‌స్టేషన్ నుంచి దళిత రైతుల పంట భూముల నుంచి సర్వేలు చేశారన్నారు. అధికారులు పూర్వపు రహదారి ప్రకారం జాతీయ రహదారి నిర్మాణం చేయడానికి 80శాతం వరకు రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల యజమానులు అంగీకరించారని, మిగితా వారు నిరాకరించారని తెలిపారు. అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చి మార్పులు చేశారన్నారు. కాగా, మళ్లీ దళితులు భూములను లాక్కోవడానికి కాళేశ్వరం, కాటారాలకు చెందిన రాజకీయ నాయకులు రోడ్డు సర్వేలను నిలిపివేశారని తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. తమ భూములు ఇవ్వమని, ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు పేర్కొన్నారు. పూర్వపు రహదారి లేదా ముక్తివనం పార్కు మీదుగా అయినా రోడ్డు నిర్మాణం చేయాలని తెలిపారు. రైతులు రెవెల్లి ఊశాలు, వెంకటస్వామి, బండెల వెంకటయ్య, లేతకరి వెంకటి, రెవెల్లి అంకయ్య ఉన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు ప్రభుత్వ పాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ఎఫ్ఎల్ఎన్ ఎంఎన్ఓ మండల రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ పట్నాలు



ఎల్లమ్మతల్లి ఆలయం వద్ద భక్తులు

టేకుమట్ల: ఎల్లమ్మతల్లి సల్లంగ చూడమ్మ అంటూ భారీగా తరలివచ్చిన భక్తజనం బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని రాఘవరెడ్డిపేట మావునాల ఎల్లమ్మతల్లి ఆలయంలో ప్రతీ ఏట నిర్వహించే ఎల్లమ్మ పట్నాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి గ్రామస్తులు డప్పు చప్పుళ్ల నడుమ బోనాలతో ఆలయానికి చేరుకుని ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు ఎల్లమ్మ పట్నాలను వేసి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అశేష జనావాహిని మధ్య ఎల్లమ్మ పట్నాలు, బోనాల జాతర అత్యంత వైభవంగా కొనసాగింది. ఆలయంలో కొనసాగే బోనాలు, పట్నాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైద్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలిశాల ఆధ్వర్యంలో జాతర ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్‌గౌడ్, మోతె రాజమౌళి, శాస్త్రాల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కత్తి సంపత్, వెల్లంపల్లి ఎంపీటీసీ సంగి రవి, ఆలయ కమిటీ చైర్మన్ వంగ ప్రభాకర్, రాఘవరెడ్డిపేట, ఆరెపల్లి సర్పంచ్ చదువు మధు రమహేందర్, గజ్జి సుజాతరమేష్ ఉన్నారు.

వైన్‌షాపులపై చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణాకర్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని వైన్‌షాపులపై ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో కిరాణా షాపుల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. యథేచ్ఛగా మద్యం వ్యాపారం సాగుతున్న ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఒకప్పుడు కిరాణా షాపులోకి వెళ్లాలంటే కిరాణా సామాను కొనుక్కొని వచ్చే విధంగా వీలుండేదని తెలిపారు. కానీ ఇప్పుడు కిరాణం షాపులు బెల్టుషాపులుగా మారయన్నారు. జిల్లాలోని వైన్‌షాపులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌రూంలు బార్లను తలపించే విధంగా ఉన్నాయన్నారు. బల్లలు కుర్చీలు వేసి మాంసం విక్రయిస్తూ ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న వైన్‌షాప్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టవాడ సురేష్, కార్తీక్, వినయ్, రాజు, నవీన్, అఖిల్, వేణు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని భూపతి సాంబమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, రూ.2 వేల నగదును శుక్రవారం అందజేశారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొదెం కృష్ణప్రసాద్ 25 కేజీల బియ్యం అందజేశారు. మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా హోటల్ నిర్వహిస్తూ అందరితో కలివిడిగా ఉండే సాంబమూర్తి స్మృతులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలేటి ఇంద్రసేనారెడ్డి చంద్రయ్యతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా స్వచ్ఛ భారత్ మిషన్ సర్వే

మంగపేట: మండలంలోని స్వచ్ఛభారత్ మిషన్(ఎస్‌బీఎం)కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాడగూడెం పంచాయతీలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రభుత్వం స్వచ్‌భారత్ మిషన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. నివాస గృహాలు, జనావాసాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు ఇంకుడు గుంతల వినియోగం, తడి పొడి చెత్త, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, కిచన్ గార్డెన్‌ల ఏర్పాటు వాటి వినియోగంపై ప్రజలు అవగాహన కల్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ రహీమున్నీసాబేగం, మాలతో రాజు, షరీఫ్‌ఉన్నీసా, ఎంపీఓ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఎం చరణ్ రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.